క్లుప్తంగా

సమితి సేవలు అభినందనీయం


పిల్లలకు పాలు, రొట్టెలు అందజేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

సామర్లకోట: పీబీదేవం గ్రామంలో శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి సేవలు అభినందనీయమని అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా బిక్కవోలు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో చంటి పిల్లలు, వృద్ధులకు పాలు, బిస్కెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులను ఆయన అభినందించారు. సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్, కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్, సభ్యులు టీవీవీ సత్యనారాయణ, ఆచంట సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, టి.సాయివంశీ, నువ్వుల వెంకటరాజు, టి.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ



బాడీ బిల్డింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ అందుకుంటున్న ప్రశాంత్

పెద్దాపురం: రాజానగరం నన్నయ యూనివర్సిటీలో ఈ నెల 16న జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో పెద్దాపురం హనుమాన్ వ్యాయామ శాల యువకుడు ప్రతిభ చాటాడు. సోమవారం వ్యాయామశాల నిర్వాహకుడు కొల్లి రాజు మాట్లాడుతూ తనుబుడ్డి ప్రశాంత్ 75 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారన్నారు. 17న అనకాపల్లిలో జరిగిన పోటీల్లో నాల్గవ స్థానం, భీమవరంలో జరిగిన పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారన్నారు. ప్రశాంత్‌ను వ్యాయామ శాల సిబ్బంది, మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం సభ్యులు అభినందించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ


వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న చిన్నయ్యదొర, రామారావు

సామర్లకోట: భారతమాత సేవా పరిషత్తు వ్యవస్థాపక అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులకు దుప్పట్ల పంపిణీ జరిగింది. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని స్థానిక సంపెంగ తోట వద్ద భారత మాత సేవా పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పోతుల రామారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సుమారు పదేళ్ల నుంచి చిన్నయ్యదొర తన సేవా సంస్థ ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహించడంతో అభినందించడానికి సామర్లకోట వచ్చినట్లు పోతుల రామారావు తెలిపారు. అనంతరం 50 మంది వృద్ధులకు దుప్పట్లు అందజేశారు.

జాగ్రత్తలతో ఆరోగ్య పరిరక్షణ

పెద్దాపురం: వ్యక్తిగత జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని కాకినాడ జిల్లా సత్యసాయి సంస్థల అధ్యక్షుడు యార్లగడ్డ గోవింద రాజులు అన్నారు. సోమవారం వడ్లమూరు సత్యసాయి మందిరంలో సమితి కన్వీనర్ చల్లా సాయిరాం ఆధ్వర్యంలో హైదరాబాద్ ఏషియన్ వ్యాస్కులర్ ఆసుపత్రి వారిచే వ్యాస్కులర్ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరాజులు, సమితి నిర్వాహకులు బాదం బాబు మాట్లాడుతూ వైద్య శిబిరానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి 280 మంది వెరికోస్ మెయిన్స్‌తో బాధపడుతున్న రోగులకు పరీక్షలు నిర్వహించామన్నారు. 89 మందికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. వీరికి డాక్టర్లు జీవీ ప్రవీణ్‌కుమార్, కె.భార్గవ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాలచర్ల శ్రీనివాస్, తుమ్మలపల్లి జోగేంద్రనాథ్, విశ్వేశ్వరరావు, సత్తిబాబు, సూర్యనారాయణ, వెంకటరమణ పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యం సాధించాలి


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు

పిఠాపురం: విద్యార్థులు విద్యతో పాటు ఆయా కోర్సులకు సంబంధించిన వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు అన్నారు. కళాశాలలో ఆన్ జాబ్ ట్రైనింగ్ కార్యక్రమం సోమవారం జరిగింది. మల్బరీ కటింగ్, తయారీ, నర్సరీ బెడ్ల తయారీ, కకూన్ మార్కెటింగ్, పట్టుదారం నాణ్యత లోపాలు చూడడం, చీరల తయారీ, పట్టు పురుగుల పెంపకం తదితర విషయాల్లో ఈ నెలాఖరు వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సెరికల్చర్ లెక్చరర్ జేబీవీఎస్ఎస్ఆర్ మాధవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


మల్లవరంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరిన భక్తులు


దుర్గాడలో ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి


కొత్తపల్లిలో పూల అలంకరణతో సుబ్రహ్మణ్యస్వామి


తాటిపర్తి ఆలయంలో సంతానం కోసం ఉపవాస దీక్షలతో ఉగ్ర మండపాల్లో నిద్రిస్తున్న భక్తులు

శరవణభవ.. శరణు

- ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలు
- తాటిపర్తి, మల్లవరంలో పోటెత్తిన భక్తులు

పిఠాపురం: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి సందర్భంగా సోమవారం గొల్లప్రోలు మండలంలోని తాటిపర్తి, మల్లవరం, గొల్లప్రోలు, చేబ్రోలు, దుర్గాడ గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచి స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉద్యోగులు, వ్యాపారులు సుదూర ప్రాంతాల నుంచి భారీఎత్తున తరలిరావడంతో మల్లవరం, తాటిపర్తి రోడ్లు వాహనాలతో రద్దీగా మారాయి.

తాటిపర్తిలో 86వ వార్షికోత్సవం

తాటిపర్తి గ్రామంలో 86వ షష్ఠి మహోత్సవాలు భారీఎత్తున ప్రారంభమయ్యాయి. ఉదయం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాల అనంతరం అభిషేకాలు, విశేష పూజలు, సాయంత్రం అపర్ణా కళాతోరణంలో వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారి దివ్యకల్యాణం కనులవిందుగా జరిగింది. భక్తులు ఆలయం వద్ద ఉన్న పుట్టల్లో పాలు పోసి, పూజలు చేశారు. స్వామివారికి సామూహిక అభిషేకాలు జరిపారు. సుమారు 60 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉగ్రమండపాల్లో మహిళలు రాత్రి నుంచి ఉపవాస దీక్ష చేపట్టారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో ఎమ్మెల్యే పెండెం దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన ఇన్‌చార్జి ఉదయ శ్రీనివాస్, జెడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు, ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మొగలి బాబ్జి, మండల అధ్యక్షుడు అరిగెల రామయ్యదొర, ఆత్మ చైర్మన్ కడింశెట్టి కుమార భాస్కర రెడ్డి, అన్నవరం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితుడు మొగలి అయ్యారావు తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


తాటిపర్తిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి సందర్భంగా మండలంలో ఉన్న పలు ఆలయాల్లో సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కొత్తపల్లి బాలాత్రిపుర సుందరి సమేత రాజశేఖరస్వామి, నాగులాపల్లి, ఎండపల్లి, గోర్సలో ఉన్న ఉమారామలింగేశ్వర స్వామి, మూలపేటలో ఉన్న కేదారేశ్వరస్వామి, నాగులాపల్లి, కొత్తపల్లిలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయాల్లో ఉన్న సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు.

కొమరగిరిలో వార్షిక కల్యాణ మహోత్సవాలు

మండలంలోని కొమరగిరిలో ఉన్న విఘ్నేశ్వర స్వామి ఆలయంలో ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఘనంగా చేస్తున్నారు. సోమవారం షష్ఠి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు.


సామర్లకోట పంచారామ క్షేత్రంలో సుబ్రహ్మణ్యస్వామికి కల్యాణం చేస్తున్న పండితులు

శుభములివ్వు... సుబ్రహ్మణ్యేశ్వరా

- భక్తిశ్రద్ధలతో షష్ఠి మహోత్సవాలు
- స్వామివారికి అభిషేకాలు, కల్యాణం
- పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ

సామర్లకోట: శుభములివ్వు.. సుబ్రహ్మణ్యేశ్వరా అంటూ ఆ స్వామిని భక్తులు కొలిచి తన్మయత్వం చెందారు.. సోమవారం సామర్లకోట, పిఠాపురం నియోజకవర్గాల్లో షష్ఠి మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి దేవస్థానంలో వేంచేసి ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం భక్తులతో రద్దీగా మారింది. ఆలయ అర్చకులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలు చేశారు. కుమారారామ భీమేశ్వరస్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తొలుత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు, అభిషేకాల అనంతరం వీరప్రకాశరావు, స్వాతి దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయంలోని నంది మండపం వద్ద ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి కల్యాణం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభిషేక పండితులు వేమూరి సోమేశ్వర స్వామి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విశిష్టతను వివరించారు. శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, దత్తులు స్వామివారికి అభిషేకాలు, పూజలు, కల్యాణం జరిపించారు. స్వామి కల్యాణం తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అలాగే పంచారామ క్షేత్రంలో కుమారారామ భీమేశ్వరస్వామి వారికి తెల్లవారు జాము నుంచి పూజలు జరిగాయి. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం తరపున ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, నాతిపాముల సూరిబాబు, చల్లా కుమారి, బొండలపు కృష్ణవేణి, కర్రి వెంకటలక్ష్మి, భక్త సంఘ సభ్యులు సేవలందించారు. బుధవారం అష్టమి సందర్భంగా దేవస్థానంలోని కాలభైరవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని ఈఓ డి.నాగ మల్లేశ్వరరావు తెలిపారు. అలాగే పనసపాడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

వేడుకగా షష్ఠి ఉత్సవాలు

పెద్దాపురం: పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక పాండవుల మెట్టపై వల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, చదలాడ, జి.రాగంపేట, చంద్రమాంపల్లిలలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలకు భక్తుల రద్దీ నెలకొంది. ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. చదలాడ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో భక్తులు భారీ క్యూ కట్టారు. సీఐ రవికుమార్, ఎస్ఐ వి.సురేష్ పర్యవేక్షణలో ఆలయం వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు. స్వామివారిని గ్రామంలో ఊరేగించగా బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. ప్రత్తిపాడు– సామర్లకోట రహదారిలోని జి.రాగంపేట గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నాగుల చవితి, పున్నమి చవితి రోజున పుట్టలో పాలు పోయలేని భక్తులు షష్ఠి రోజున పుట్టలో పాలు పోయడం ఆనవాయితీగా వస్తోంది. కుటుంబ సమేతంగా పుట్టల వద్ద పూజలు నిర్వహించారు.


చదలాడలో ధ్వజస్తంభం వద్ద మొక్కుతున్న భక్తులు


పాండవుల మెట్టపై సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

సృజనకు వేదికలు సైన్స్ ప్రదర్శనలు

సామర్లకోట: చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి సైన్స్ ప్రదర్శనలు మంచి వేదికలని కాకినాడ ఉప విద్యాశాఖాధికారి డానియల్ రాజు అన్నారు. సోమవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో మండల స్థాయి సైన్సు ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావిభారత శాస్త్రవేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కొత్త ఆవిష్కరణలకు రూపకల్పన చేయడంతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. నేటి విద్యార్థులు రేపటి శాస్త్రవేత్తలుగా మారడానికి ఈ సైన్సు ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. మండల స్థాయిలో మూడు విభాగాల్లో 120 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఇందులో ఉపాధ్యాయ, విద్యార్థి వ్యక్తిగత, గ్రూప్ ప్రాజెక్టులు ఉన్నాయన్నారు. ఇందులో విజేతలకు డానియల్ రాజు బహుమతులు ప్రదానం చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను మండల విద్యాశాఖాధికారులు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు ఎంతగానో ఆకట్టుకున్నాయని వారు తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, హెచ్‌ఎంలు తోటకూర సాయిరామకృష్ణ, ఎం.కూర్మారావు, యు.సత్యనారాయణ, టి.శ్యామ్‌సుందర్, ఉపాధ్యాయులు ఎఎల్‌వీ కుమారి, కె.అరుణ, కె.శ్రీనివాసు, జి.గోవిందు, కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులు తయారు చేసిన సైన్సు ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఉప విద్యాశాఖాధికారి, ఎంఈఓలు

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డులోని 33/11 కేవీ విద్యుత్తు సబ్ స్టేషన్‌లో 11 కేవీ ఫీడర్ల మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎవీఎస్‌డీఎస్ ప్రభాకర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనివల్ల పట్టణంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

కొత్తమూలపేటలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

కొత్తపల్లి: మండలంలోని కొత్తమూలపేట సచివాలయంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహ సారథులకు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ సమకూర్చిన కిట్లను పంపిణీ చేశారు. సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును ఈఓపీఆర్డీ భాస్కరరావు ఆవిష్కరించారు. సెంటర్లో పార్టీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వల్లి, నాయకులు పెనుమళ్ల కృష్ణారెడ్డి, రాయుడు వెంకటేశ్వరి, మాతా కుమారి, కాటూరి చినబ్బాయి పాల్గొన్నారు.


కొత్తమూలపేటలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

నిషేధిత వస్తువుల విక్రయాలపై దృష్టి పెట్టాలి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పిఠాపురం: పట్టణంలో అపాయకరమైన నిషేధిత వస్తువుల విక్రయాలపై దృష్టి సారించి, వాటిని వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు కోనేటి రాజు, కుంచే చిన్న, కె విశ్వనాథం, కె.నాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ సింథటిక్ అనుబంధ నిషేధిత వస్తువులైన ఫ్లెక్సీలు, ప్లాస్టిక్ కవర్ల వినియోగం ఎక్కువైందని, వాటిని నిషేధించినా విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. వాటిని వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. వీటి వినియోగం వల్ల పట్టణంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోందని, కాలువల్లో మురుగు పేరుకుపోయి, దోమలు విజృంభించి అంటువ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిపై వెంటనే చర్యలు తీసుకుని, నిషేధిత వస్తువులు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్లాస్టిక్ రహిత పిఠాపురంగా తీర్చిదిద్దడానికి ప్రజా సంఘాల మద్దతు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యల సత్వర పరిష్కారానికి 'స్పందన'

పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. సోమవారం డివిజన్‌లో ఆయా మండలాల నుంచి మొత్తంతొమ్మిది అర్జీలు వచ్చాయన్నారు. స్థానిక విలేకర్లతో ఆర్డీఓ మాట్లాడుతూ స్పందనలో వచ్చే ప్రతి అర్జీ సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. భూ రీసర్వే చేయాలని, ఆక్రమణకు గురైన స్థలాలను కాపాడాలని, పట్టాదారు పాస్‌బుక్‌లో పేర్లు మారాయని తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. ఆయా అర్జీలను సంబంధిత శాఖాధికారులకు పంపామని ఆర్డీఓ తెలిపారు. పెద్దాపురం అడిషనల్ డీఎంహెచ్‌ఓ సరిత, సీడీపీఓ ఉష, మున్సిపల్ మేనేజర్ యు.జ్యోతిరాణి, ఆర్డీఓ కార్యాలయ డీటీ భానుకుమార్ తదితరులున్నారు.


స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

ఆటకు సై

- మరికొద్ది రోజుల్లోనే 'ఆడుదాం ఆంధ్రా'
- 26 నుంచి సచివాలయాల స్థాయిలో ప్రారంభం
- క్రీడా పోటీల విజేతలకు నగదు బహుమతులు
- ఎంపిక చేసిన క్రీడాకారులకు నిపుణులతో శిక్షణ


ఆడుదాం ఆంధ్రా క్రీడా కిట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు (ఫైల్)

కొత్తపల్లి: గ్రామీణ స్థాయి నుంచి క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. క్రీడలకు కనీస సౌకర్యాలు కరవైన పరిస్థితి నుంచి గట్టెక్కించేలా.. క్రీడాకారులకు ఉచితంగా క్రీడా సామగ్రి పంపిణీ, పాఠశాలల్లో క్రీడామైదానాల అభివృద్ధి, పిల్లల నుంచి పెద్దల వరకూ, విద్యార్థుల నుంచి ఉద్యోగుల వరకూ అందరికీ అవకాశం కల్పిస్తూ ఈ బృహత్తర కార్యక్రమానికి రూపకల్పన చేశారు. ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి మూడు వరకూ సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ సుదీర్ఘంగా ఈ పోటీలు జరగనున్నాయి. ఈ క్రీడా సంబరాలకు అధికార యంత్రాంగం చురుగ్గా సన్నాహాలు చేస్తోంది. క్రీడల్లో క్రికెట్, బ్యాడ్మింటన్ డబుల్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో వంటి ఆటల పోటీలను నిర్వహిస్తున్నారు.

నియోజకవర్గ పరిధిలో..

పిఠాపురం నియోజకరవర్గ పరిధిలో కొత్తపల్లి, పిఠాపురం, పిఠాపురం టౌన్, గొల్లప్రోలు, గొల్లప్రోలు అర్బన్‌లో 85 సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయ పరిధిలో క్రీడాకారులను వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్రా ఎంతగానో దోహదపడతాయి. క్రీడల్లో నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతులు అందజేయనున్నారు. సచివాలయ స్థాయిలో ఈ నెల 26 నుంచి ప్రారంభమవుతాయి. జనవరి రెండున మండల స్థాయి పోటీలు మొదలవుతాయి. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు షెడ్యూల్‌ను అధికారులు ఖరారు చేయనున్నారు.


కొత్తపల్లి జెడ్పీ స్కూల్ మైదానంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

రిజిస్ట్రేషన్ వివరాలు

- పిఠాపురం టౌన్, రూరల్ సచివాలయాలు-40, పేర్లు నమోదు చేసుకున్నవారు 9,120
- గొల్లప్రోలు అర్బన్, రూరల్ సచివాలయాలు-20, పేర్లు నమోదు చేసుకున్నవారు 5,305
- కొత్తపల్లి మండలంలో సచివాలయాలు-25, పేర్లు నమోదు చేసుకున్నవారు 5,767

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలకు నగదు బహుమతి

బహుమతి	నియోజకవర్గ	జిల్లా	రాష్ట్ర
మొదటి	రూ.35 వేలు	రూ.60 వేలు	రూ.5 లక్షలు
ద్వితీయ	రూ.15 వేలు	రూ.30 వేలు	రూ.3 లక్షలు
తృతీయ	రూ.5 వేలు	రూ.10 వేలు	రూ.2 లక్షలు

బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలకు

బహుమతి	నియోజకవర్గ	జిల్లా	రాష్ట్ర
మొదటి	రూ.20 వేలు	రూ.35 వేలు	రూ.2 లక్షలు
ద్వితీయ	రూ.10 వేలు	రూ.20 వేలు	రూ.ఒక లక్ష
తృతీయ	రూ.5 వేలు	రూ.10 వేలు	రూ.50 వేలు

20 వరకూ పేర్ల నమోదు



క్రీడలపై ఆసక్తి ఉన్న వారు, ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ నెల 20 వరకూ తమ పేర్లను సచివాలయాల్లో నమోదు చేసుకోవచ్చు. ఈ పోటీలు గ్రామ సచివాలయాల్లో 26న ప్రారంభమవుతాయి.

– వెంకట నారాయణ, ఎంపీడీఓ, కొత్తపల్లి

క్రీడాకారులకు శిక్షణ



ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేయించుకున్న క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నాం. ఈ పోటీలకు గ్రామ సచివాలయ పరిధిలో క్రీడా స్థలాన్ని ఎంపిక చేశాం. పాఠశాలలో ఉన్న క్రీడా స్థలాల్లో విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా ఉదయం, సాయంత్రం శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటికే ప్రభుత్వం ద్వారా అందిన క్రీడా కిట్లను సచివాలయాల పరిధిలో పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో ఉన్నాయి. ఆ కిట్ల ద్వారానే క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు.

– రవిరాజ్, వ్యాయామ ఉపాధ్యాయుడు, ఆడుదాం ఆంధ్రా మండల కోఆర్డినేటర్